సాక్షి
గుంటూరు
శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024




రామాలయ ప్రతిష్ట వేడుకలు

భట్టిప్రోలు: మండలంలోని అద్దేపల్లిలో నిర్మించిన రామచంద్రస్వామి ఆలయ నూతన ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: ఈనెల 29న నిర్వహించనున్న భావనారుషి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట ఆహ్వాన పత్రికలను పద్మశాలీయ బహుత్తమ సంఘం ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 516.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గెలుస్తాం.. చరిత్ర సృష్టిస్తాం

ప్రతిపక్షాల కుర్చీలు మడతపెట్టేందుకు ప్రజలు సిద్ధం

- ఈ జిల్లాలో టీడీపీ బ్యాచ్ గొర్రెల కాసుకునే వాడికి మంత్రి పదవి ఇచ్చారంటూ ఎగతాళి చేశారు
- ఇక్కడే ఎంపీగా గెలిచి చూపిస్తా..
- జనం గుండెల్లో జగనన్న ఉన్నారు
- క్రోసూరు బీసీల ఆత్మీయ సదస్సులో నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్
- పెదకూరపాడులో 30 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలో జరిగింది : ఎమ్మెల్యే శంకరరావు



మాట్లాడుతున్న అనిల్ కుమార్ యాదవ్, వేదికపై రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మోపిదేవి, ఎమ్మెల్సీ ఏసురత్నం, ఎమ్మెల్యే శంకరరావు తదితరులు

క్రోసూరు,పెదకూరపాడు: చరిత్ర కలిగిన నర్సరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా మొట్టమొదటిసారి బీసీ అయిన నాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవకాశం ఇచ్చారని ఇక్కడ గెలిచి, చరిత్ర సృష్టిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మార్కెట్ యార్డు ప్రాంగణంలో గురువారం రాత్రి నిర్వహించిన బీసీల ఆత్మీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత వహించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇదే జిల్లాకు చెందిన టీడీపీ పేటీఎం బ్యాచ్ నన్ను గొర్రెలు కాసేవాడినంటూ ఎగతాళి చేశారని, వారికి సవాల్ చేస్తున్నా ఇదే జిల్లాలో ఎంపీగా తాను గెలుస్తానన్నారు. నెల్లూరు నుంచి వచ్చే సమయంలో కొంత బాధపడ్డానని, పల్నాడులో అడుగుపెట్టాక జగనన్న సరైన ప్రాంతానికే తన్ను పంపారని అర్థమైందన్నారు. జనం గుండెల్లో గూడు కట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డిపై కట్టకట్టుకుని ప్రతిపక్షాలు వస్తున్నాయన్నారు. దమ్ము, పౌరుషం ఉన్న నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని, అందుకే ఒంటరిగా ఎన్నికల బరిలో ఉన్నారన్నారు. ప్రజలు ప్రతిపక్షాల కుర్చీలను మడతేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చొక్కాలు మడతపెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి..

వర్ధంతికి, జయంతికి తేడా తెలియని వ్యక్తి.. సరిగ్గా మాట్లాడటం రానివ్యక్తి పోటీలో ఉండొచ్చు గానీ, గొర్రెలు కాసుకునే నేను మంత్రిని కాకుడదా అని అనిల్ యాదవ్ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ సత్తా చాటేందుకు 50 రోజులు మాత్రమే ఉందని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే నా లాగానే అనేక మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు చట్టసభల్లోకి వెళ్తారన్నారు. టీడీపీ నేతలు, సినిమా వాళ్లు మీకు రూ.లక్షలు ఇస్తాం, బంగారం ఇస్తామంటూ మోసం చేసేందుకు వస్తారని వారి మాటలు నమ్మవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా తనకు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు రెండు ఓట్లు వేసి పెత్తందారుల గర్వం అణచాలన్నారు.

నేతలకు బ్రహ్మరథం..

క్రోసూరు ఆత్మీయ సదస్సుకు హాజరైన నేతలకు పెదకూరపాడు నియోజకవర్గ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జాతీయ బీసీసంఘం నేత, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మోపిదేవి వెంకట రమణ, నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, పలు బీసీ కార్పొరేషన్ల చైర్మన్లకు ఘన స్వాగతం పలికారు. ముందుగా మండలంలోని పీసపాడు గ్రామం నుంచి వారికి గుర్రాలు, పొట్టేళ్లు, ఎడ్ల బండ్లతో భారీ బాణసంచాతో స్వాగతం పలికారు. బీసీ కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత క్రోసూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు ర్యాలీగా సభా స్థలం వద్దకు చేరుకున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, నియోజకవర్గ యువజన నేత నంబూరు కళ్యాణ్ చక్రవర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, నేతలు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన జనసందోహం



ర్యాలీలో ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, అనిల్ కుమార్ యాదవ్

అభివృద్ధి చేశా.. ధైర్యంతో ఓటు అడుగుతున్నా..

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధి చేసి చూపించానని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అభివృద్ధి చేశాను కాబట్టే ధైర్యంతో ఓటుఅడుగుతున్నానన్నారు. రూ.82 కోట్లతో స్కూళ్లు, రూ.27 కోట్లతో వైద్యశాలలు, సచివాలయాలు నిర్మించి గ్రామస్వరాజ్యం తెచ్చామన్నారు. చంద్రబాబు చెప్పే సంపద సృష్టి అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు లేదన్నారు. చంద్రబాబు అబద్ధాలకోరు అని ఆయన మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పులిచింతల బ్యాక్ వాటర్‌తో క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాలకు తాగు, సాగు నీరు అందిస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమ, ఎలక్ట్రానిక్ పరికరాల పరిశ్రమ, అమరలింగేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి, ఎత్తిపోతల పథకాలు, అమరావతి, ధరణికోటలను మున్సిపాల్టీలుగా చేస్తామన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించండి

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

2024 ఎన్నికల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. 139 బీసీ కులాలను వెలుగులోకి తెచ్చి నామినేట్ పదవులు ఇచ్చిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనేకమంది బడుగులకు అరుదైన అవకాశం కల్పించారన్నారు.

న్యూస్‌రీల్

రాజ్యాంగంపై అవగాహన అవసరం



నరసరావుపేట: రాజ్యాంగంలోని అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రచించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం, అందులోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో రచించిన పుస్తకాన్ని విద్యార్థులంతా తప్పకుండా చదవాలని కోరారు. రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలతో పాటు రచన కమిటీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన అమూల్యమైన కృషిని పుస్తకంలో ప్రస్తావించారు. రాజ్యాంగంపై విద్యార్థుల్లో మరింత విశ్వాసం, నమ్మకం పెంపొందించడమే లక్ష్యంగాని రచించిన పుస్తకాన్ని లాభాపేక్షకు తావులేకుండా విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. నామమాత్రపు రుసుముతో లభ్యమయ్యే రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని విద్యాలయాల్లో లభ్యమయ్యేలా కృషి చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్సీ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్ కుమార్, జి. విజయసారథి పాల్గొన్నారు.

జగన్నాథునికి పంచామృత అభిషేకం



ముప్పాళ్ళ: చాగంటివారిపాలెంలో వేంచేసియున్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మొదటి రోజు పంచామృత అభిషేకం నిర్వహించారు.

శతాధిక వృద్ధురాలు మృతి




తిరుపతమ్మ(ఫైల్)

యడ్లపాడు: యడ్లపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పోపూరి తిరుపతమ్మ (102) బుధవారం రాత్రి ఆమె స్వగృహంలో మృతిచెందారు. ఆమెకు కుమారుడు కాళిదాసు, కుమార్తె సామ్రాజ్యమ్మతోపాటు మనుమలు, మనుమరాండ్లు, ముని మనుమలు, ఇలా ఐదు తరాలను ఆమె చూశారు. భర్త పోపూరి వెంకటేశ్వర్లు సుమారు 25 సంవత్సరాల కిందట మృతి చెందాడు. తిరుపతమ్మకు 102 సంవత్సరాలు వచ్చినప్పటికీ బీపీ, షుగర్, గ్యాస్ట్రబుల్ వంటి సమస్యలు ఏమీ లేవు. మందులు కూడా వాడేది కాదు. ఇప్పటికీ మంచాన పడకుండా తన పనులను తానే చేసుకుంటూ సాధారణ మృతి చెందింది.

నేడు స్టాఫ్‌నర్సులకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 14 మందికి హెడ్‌నర్సులుగా ప్రమోషన్ కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ జి.శోభారాణి తెలిపారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే ప్రమోషన్ కౌన్సెలింగ్ కు జోన్-3లో ప్రమోషన్‌కు అర్హత ఉన్న 14 మంది స్టాఫ్‌నర్సులు హాజరు కావాలన్నారు.

నిదానంపాటి అమ్మవారి ఆదాయం రూ.12 లక్షలు



దుర్గి: అడిగొప్పుల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.12,01,375ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సైదమ్మ బాయి తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో 44 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. ఈ నెల 24న ఆదివారం అమ్మవారి తిరునాళ్ల జరపనున్నట్లు పేర్కొన్నారు. వినుకొండ గ్రూప్ టెంపుల్స్ ఈఓ కొల్లి హనుమంతరావు, కరాలపాటి సుబ్బారావు, పాండురంగారావు, కలవల వెంకటేశ్వర్లు, ఎన్ఎంఆర్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పొత్తిళ్ల శిశువులపై ప్రత్యేక శ్రద్ధ

- గుంటూరు జీజీహెచ్‌లో నవజాత శిశు కేంద్రం నిర్మాణం
- రూ. 2 కోట్లతో ఎన్ఐసీయూ నిర్మాణం
- పసికందులకు ఉచితంగా రూ.లక్షలు ఖరీదు చేసే వైద్యం



అత్యాధునిక వైద్య పరికరాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు

గుంటూరు మెడికల్: పసికందుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. అందులో భాగంగా అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటైన వైద్యసేవలు ఉచితంగా అందించేలా ప్రతి జిల్లాల్లో ప్రత్యేకంగా నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (ఎన్ఐసీయూ) మంజూరు చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో ఇటీవల కాలంలో రూ. 2 కోట్లతో అత్యవసర చికిత్సలు అవసరమైన పసికందుల ప్రాణాలు కాపాడేందుకు అత్యాధునిక వైద్యసేవలు అందించే ఎన్ఐసీయూ నిర్మాణం చేశారు. గతంలో ఉన్న ఎన్ఐసీయూకు అదనంగా మరో ఎన్ఐసీయూ నిర్మాణం చేయటంతోపాటుగా అత్యాధునిక వైద్య పరికరాలు, వైద్యులు, వైద్య సిబ్బందిని సైతం ప్రభుత్వం జీజీహెచ్‌కు మంజూరు చేసింది.

నూతనంగా 40 పడకలు..

గతంలో జీజీహెచ్‌లో పసికందులకు చికిత్స అందించే ఎన్ఐసీయూ వైద్య విభాగంలో 40 పడకలు ఉన్నాయి. వీటికి అదనంగా ప్రభుత్వం ఇటీవల కాలంలో 20 పడకలు ఎన్ఐసీయూ వైద్య విభాగంలో మరో 20 పడకలు మంజూరు చేసింది. 28 మంది స్టాఫ్ నర్సులను, నలుగురు డాక్టర్స్‌ను సైతం ప్రభుత్వం నియమించింది. గతంలో పిల్లల వైద్య విభాగంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులన్నీ భర్తీ చేయటంతో నేడు ఒక వైద్య విభాగాధిపతి, ఇరువురు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, తొమ్మిది మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 12 మంది పీజీ వైద్యులు పిల్లల వైద్య విభాగంలో నిత్యం అందుబాటులో ఉండి పసికందుల ప్రాణ రక్షణే ధ్యేయంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

ఎన్ఐసీయూలో చికిత్స పొందిన పసికందుల వివరాలు..	
2019లో	2,860
2020	3,226
2021	3,380
2022	3,333
2023	3,164
2024 జనవరి 28 నాటికి 90 మంది పసికందులు చికిత్స పొందారు	

రూ.69 లక్షల ఖరీదుచేసే వైద్య పరికరాలు...

పసికందుల ప్రాణాలు రక్షించేందుకు అవసరమైన రూ.69,25,576 విలువ కలిగిన అత్యాధునిక వైద్య పరికరాలను ప్రభుత్వం అందజేసింది. కొంత మంది పిల్లలకు పుట్టకానే కామెర్లు వస్తాయి. వీరిని ఫొటోథెరపీ యూనిట్‌లో ఉంచి చికిత్స చేస్తారు. 15 పరికరాలను ప్రభుత్వం నూతనంగా ఇచ్చింది. వెచ్చదనం అందించే వార్మర్‌లు 60, సీ ప్యాప్ మిషన్లు 12, వెంటిలేటర్లు 12 ప్రభుత్వం అందజేసింది. ప్రతి పడకకు ఒక పల్స్ ఆక్సీమీటర్ చొప్పున 40 పల్స్ ఆక్సీమీటర్లు, 20 సిరంజ్ పంప్స్, డబుల్ సర్ఫేస్ ఫొటోథెరఫీ యూనిట్లు 10, లెరంజోస్కోప్ సెట్లు 10, సెక్షన్ ఆపరేటర్లు 4, ఇతర పరికరాలను ప్రభుత్వం అందజేసింది.

మా పాప ప్రాణాలు కాపాడారు..



నేను ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చాను. బిడ్డపుట్టగానే ఆక్సిజన్ అందక ఆయాసంగా ఉండటంతో తక్షణమే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లాము. ప్రతిరోజూ రూ.10వేలకుపైగా ఖర్చు అవుతోంది. మాకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో మూడురోజుల్లోనే జీజీహెచ్‌కు వచ్చాం. పసికందు ఆరోగ్య పరిస్థితి గమనించి తక్షణమే ఎన్ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఆక్సిజన్ వెంటిలేటర్ ఇతర వైద్య సౌకర్యాలన్నీ ఉచితంగా అందించి బిడ్డ ప్రాణాలు కాపాడారు.

– మొహమ్మద్ ఆయేషా బేగం, గుంటూరు

రూ. లక్షల ఖరీదు చేసే వైద్యం ఉచితంగా..



గుంటూరు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగంలోని ఎన్ఐసీయూ యూనిట్‌లో లక్షలాది ఖరీదు చేసే వైద్య సేవలన్నీ పూర్తి ఉచితంగా అందిస్తున్నాం. ప్రతిరోజూ ఎన్ఐసీయూ వైద్య విభాగంలో పిల్లలకు అడ్మిషన్లు ఇస్తున్నాం. 24 గంటలూ పసికందులను కంటికి రెప్పలా కాపాడుతున్నాం. అత్యాధునిక వైద్య సౌకర్యాలు ప్రభుత్వం కల్పించడం ద్వారా పేదలకు కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ పి.పద్మలత, పిల్లల వైద్య విభాగాధిపతి

జీజీహెచ్ అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ..



గుంటూరు జీజీహెచ్‌లో పేదలకు కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా వైద్య సేవలు అందిస్తున్నాం. ముఖ్యంగా చిన్నపిల్లల వైద్య విభాగంలో ఇటీవల కాలంలో రూ. 2 కోట్లతో అత్యాధునిక ఐసీయూను ప్రభుత్వ నిర్మించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపించి నిధులు విడుదల చేయడంతో అన్ని వార్డులను ఆధునీకీకరిస్తున్నాం.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఆరోగ్య కేంద్రాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

గుంటూరు మెడికల్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. గుంటూరులోని ఎల్‌బీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. తాను స్వయంగా రక్త పరీక్ష చేయించుకొని అక్కడ జరుగుతున్న పరీక్షల నాణ్యతను పరిశీలించారు. స్థానికంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన రోగులను సైతం వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగులకు ఏమేమి వైద్యపరీక్షలు, స్కానింగ్ ఎలా చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల ఆన్‌లైన్ వివరాల నమోదు కార్యక్రమం, ఈ-సంజీవని గురించి సైతం ఆరా తీశారు. అర్బన్ పీహెచ్‌సీలోని అన్ని గదులను కూలంకషంగా పరిశీలించారు. కమిషనర్ వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డీపీఓ సైమన్ రాజు ఉన్నారు.



వైద్యుడితో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని, తదనుగుణంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 57,538 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. 92 పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 28లోపు కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న మౌలిక సదుపాయాలను చీఫ్ సూపరింటెండెంట్లు పరిశీలించాలని చెప్పారు. వేసవి దృష్ట్యా మంచినీటితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూయించాలన్నారు. పరీక్షలకు సంబంధించి కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి స్టోరేజ్ పాయింట్లు అక్కడి నుంచి పరీక్ష కేంద్రాలకు చేర్చేందుకు పోలీస్ ఎస్కార్ట్ తీసుకోవాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యాశాఖ మంత్రితో వీడియో సమావేశం..

ప్రస్తుతం 10వ తరగతి, ఇంటర్, డీఎస్సీ, టెట్ పరీక్షల సమయం కావడంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి సమన్వయంతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి విద్యాశాఖ కార్యాలయం నుంచి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

యార్డుకు భారీస్థాయిలో మిర్చి బస్తాలు

- ప్రతి బుధవారం దిగుమతులు నిలిపివేత
- మిర్చి రైతులు సహకరించాలి
- మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి యార్డులో ప్రతి బుధవారం దిగుమతులను నిలిపివేయనున్నట్లు యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పేర్కొన్నారు. సీజన్ కావడంతో ప్రతి రోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీస్థాయిలో రైతులు మిర్చి బస్తాలను తరలిస్తున్నారని తెలిపారు. యార్డుకు అధికంగా మిర్చి తీసుకురావడం వల్ల మిర్చి దిగుమతులు పెరుగుతున్నాయని వెల్లడించారు. దీంతో యార్డులో అమ్మకాలకు, కొనుగోలు చేసిన మిర్చి బస్తాలను బయటకు తరలించడానికి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి, ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నాయకులు, యార్డు అధికారులతో గురువారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ అందరి సూచనలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి బుధవారం దిగుమతులను నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని వివరించారు. అలాగే ప్రతి బుధవారం యార్డులో క్రయ, విక్రయాలు యథావిధిగా జరుగుతాయని, కేవలం దిగుమతులను మాత్రమే నిలిపివేయడం జరుగుతోందన్నారు. మిర్చి రైతులు తమ మిర్చి బస్తాలను బుధవారం తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారులు, ఎక్స్‌పోర్టర్స్, రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సహకరించాలని సూచించారు. సమావేశంలో మిర్చి దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు లేళ్ల పెద అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, ఎగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు జుగురాజ్ భండారీ, పి.నరేంద్ర, టి.రామకృష్ణ, రమేష్, యార్డు అధికారులు ఆంజనేయసింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల పాత్ర కీలకం

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతోనే ప్రజల ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల వద్దకు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గ్రామ వలంటీర్లు సేవా దృక్పథంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. గ్రామ వలంటీర్ల సేవలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్లకు వందనం కార్యక్రమం కింద పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఐసీఏఐ గుంటూరు రథసారథి నూతలపాటి


అమర్‌నాథ్


భరద్వాజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ చైర్మన్‌గా నూతలపాటి అమర్‌నాథ్, కార్యదర్శిగా రుద్రవరపు భరద్వాజ ఎన్నికయ్యారు. శ్రీనివాసరావుతోటలోని ఐసీఏఐ భవన్‌లో గురువారం 2024–25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్‌గా చింతా రఘునందన్, కోశాధికారిగా నరేష్, సికాస చైర్మన్‌గా మృత్యుంజయరావు, కమిటీ సభ్యులుగా వంగల భార్గవి, మద్ది రవితేజ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న ఐసీఏఐ గుంటూరు శాఖ భవనాన్ని పూర్తి చేసి, సీఏలకు, సీఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఆదాయపు పన్ను, జీఎస్టీ అధికారులతో పాటు అన్ని వర్తక సంఘాలను, సభ్యులను కలుపుకుని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌సీ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు సీఏ విద్యపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించి సీఏలుగా తీర్చిదిద్దుతామన్నారు.

ఐపీఎస్ అధికారి నివాసంలో చోరీ

పెదకాకాని: తాళాలు వేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడిన సంఘటన గుంటూరు జిల్లా కాజ టోల్‌గేట్ సమీపంలోని రామకృష్ణ విల్లాస్‌లో చోటు చేసుకుంది. మండలంలోని రామకృష్ణ విల్లాస్ (ఆర్‌కె)లో ఐపీఎస్ అధికారికి ఒక ఫ్లాట్ ఉంది. ప్రస్తుతం ఆయన అనంతపురం 14 బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో చోరీ జరిగిన ఇంటిని గురువారం గుంటూరు క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, మంగళగిరి డీఎస్పీ సీహెచ్ రవికాంత్, సిబ్బంది పరిశీలించారు. ఇంటిలోని బీరువా పగులగొట్టి వస్తువులు, దుస్తులు చిందర వందరగా పడవేసినట్లు సమాచారం.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత
- ఫిరంగిపురంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు అందజేత


మహిళలకు చెక్కు అందజేస్తున్న మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: మహిళాసాధికారతే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొని సుచరిత మాట్లాడుతూ తన సొంత గ్రామంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ప్రతి మహిళ లక్ష్యాధికారి కావాలన్నదే లక్ష్యంగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పనిచేశారన్నారు. తరువాత చంద్రబాబు నాయుడు హయాంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా మోసం చేశాడన్నారు.

సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనపాద యాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం సున్నావడ్డీ రుణాలు ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ సీపీ ద్వారా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతిఏటా వైఎస్సార్ ఆసరా ద్వారా రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నాలుగు విడతల రుణాలు అందజేసినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరుకున్నారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలలో భాగంగా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి వంటి పథకాలు ప్రవేశపెట్టి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని చెప్పారు. కరోనా వచ్చిన సమయంలో పథకాలు అందేలా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేశారన్నారు. మండలంలో 38 గ్రూపులు ఉండగా 14 వేల 740 మంది సభ్యులు ఉండి వారికి వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.8 కోట్ల నాలుగు లక్షలు అందినట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేశారని చెప్పారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్ప రెడ్డి, జి.చంద్రం, మేడాబాబు, సలీం, బాపూజీరెడ్డి, థామస్‌రెడ్డి, బి.అంజిరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, చౌడయ్య, ఖాజావలి, చేవూరి రామమోహన్‌రెడ్డి, జి.మస్తాన్‌వలి, పి.చిన్నపి. శ్రీనివాసరెడ్డి, చంద్ర శేఖర రెడ్డి, మీరావలి, సంజీవరెడ్డి, వి.వీరయ్య, హేమలతారెడ్డి, డి.నరేంద్ర కుమార్, టి.కృష్ణ, డేవిడ్, బ్రహ్మారెడ్డి, ఎంపీడీవో విమాదేవి, ఇంచార్జి ఏపీఎం సమాధానం, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో ఉయ్యాలవాడ వర్థంతి


ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి

గుంటూరు రూరల్: బ్రిటీష్ పాలకును ఎదిరించి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మిదేవి తెలిపారు. ఉయ్యాలవాడ వర్థంతి సందర్భంగా లాంఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో గురువారం ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉయ్యాల వాడ నిత్య పోరాట యోధుడని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పలువురు డీఎస్పీలు బదిలీ

తుళ్లూరు డీఎస్పీగా అశోక్‌కుమార్ గౌడ్

నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఆరుగురు డీఎస్పీలను బదిలీ చేశారు. ఇందులో గుంటూరు రేంజ్ పరిధిలో పలువురిని నియమించారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్–2 ఏసీపీ ఈ.అశోక్‌కుమార్ గౌడ్‌ను గుంటూరు జిల్లా తుళ్లూరు డీఎస్పీగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఎం.వెంకటేశ్వర రావుని ఇంటిలిజెన్స్‌కు, నూజివీడు డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణ ను బాపట్ల డీఎస్పీగా బదిలీయ్యారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ టి.వెంకటేశ్వర్లును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ఏసీపీ ట్రాఫిక్–2కు, తూర్పుగోదావరి జిల్లా ఏసీబీ / ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావుని పల్నాడు జిల్లా సీసీఎస్‌కు బదిలీయ్యారు.

వైఎస్సార్ సీపీ అసెంబ్లీ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అసెంబ్లీ పరిశీలకులను నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. గుంటూరు ఈస్ట్ పరిశీలకునిగా మిట్టపల్లి రమేష్ బాబు, గుంటూరు వెస్ట్ పరిశీలకునిగా రాతంశెట్టి సీతా రామాంజనేయులు(లాలుపురం రాము), తెనాలి పరిశీలకునిగా మందపాటి శేషగిరిరావు, ప్రత్తిపాడు పరిశీలకునిగా మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు.

- బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ పరిశీలకునిగా శ్యాంప్రసాద్ రెడ్డి, రేపల్లె నియోజకవర్గం పరిశీలకునిగా అడపా శేషగిరిరావు, బాపట్ల పరిశీలకురాలిగా నల్లమోతు రూత్‌రాణి, పర్చూరు పరిశీలకునిగా తల్లం సాయి గోపాలకృష్ణ నియమితులయ్యారు.
- పల్నాడు జిల్లా చిలకలూరిపేట పరిశీలకునిగా చిట్టా విజయభాస్కర్ రెడ్డి, నరసరావుపేట పరిశీలకునిగా షేక్ గులాం రసూల్, సత్తెనపల్లి పరిశీలకునిగా పడాల సాంబశివారెడ్డి, వినుకొండ పరిశీలకునిగా యర్రం వెంకటేశ్వరరెడ్డి, మాచర్లకు దేవేళ్ల రేవతిని నియమించారు. పార్టీ పరిశీలకులుగా నియమితులైన వారు ఆయా నియోజకవర్గ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తారు.

మృతుడి కుటుంబానికి న్యాయం

- విద్యుదాఘాతంతో మృతిచెందిన కుటుంబానికి అండగా నిలిచిన మానవ హక్కుల కమిషన్
- 5 లక్షలు పరిహారం మంజూరు చేసిన విద్యుత్‌శాఖ


బుల్లా పిచ్చయ్య (ఫైల్)

పెదకాకాని: విద్యుదాఘాతంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అండగా నిలిచింది. కరెంటు తీగలు తెగిపడి మృతి చెందినా పట్టించుకోని విద్యుత్‌శాఖ కమిషన్ ఆదేశాలతో 5 లక్షలు నష్టపరిహారం మంజూరు చేసింది. మృతుడు బుల్లా పిచ్చయ్య కుమారుడు బెనర్జీ తెలిపిన వివరాల ప్రకారం పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామానికి చెందిన బుల్లా పిచ్చయ్య, నాగమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. 2023 మే 24న పిచ్చయ్య తన కుమార్తె భవానీతో కలసి కొల్లిపర మండలం, తూములూరు గ్రామంలో జరుగుతున్న బంధువు మున్నంగి నాగరాజు కుమార్తె వివాహానికి వెళ్ళారు. మధ్యాహ్న సమయంలో టెంటు కింద భోజనం చేస్తుండగా పెద్ద గాలి వీచి అక్కడున్న చీమతుమ్మ చెట్టు విరిగి కరెంటు తీగలపై పడింది. తీగలు తెగి టెంట్ మీద పడటంతో అందరూ ప్రాణభయంతో పరుగులు తీశారు. ఆ సమయంలో టెంట్ కింద ఉన్న బుల్లా పిచ్చయ్య కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు ముందుగా తెనాలిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఆపరేషన్ చేసినప్పటికీ కరెంటు షాక్ ఎక్కువగా తగలడం వలన రెండు కాళ్లు స్పర్శ కోల్పోయాయని వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూన్ 14వ తేదీన బుల్లా పిచ్చయ్య మరణించాడు. ఆకస్మాత్తుగా జరిగిన ప్రమాదంగా పరిగణనలోకి తీసుకుని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోనే సమాచారం ఏఈ, పై అధికారులకు తెలియజేయాలని తప్పించుకున్నారు. గత్యంతరం లేక బాధిత కుటుంబం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు (నాన్ జ్యుడీషియల్) డాక్టర్ గోచిపాతల శ్రీనివాసరావు సహకారంతో కర్నూలులోని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి 5 లక్షల రూపాయలు నష్టపరిహారం మంజూరు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలియజేశారు.

సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విజయకేతనం


మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) బుధవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఇంటర్‌లో అఖిల భారత స్థాయిలో ప్రకటించిన టాప్–50 ర్యాంకుల్లో బోయపల్లి ప్రీతమ్‌రెడ్డి 5వ ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 49 మంది ఉన్నారని వివరించారు. సీఎంఏ ఫైనల్ టాప్–50 ర్యాంకుల్లో గోగుల భార్గవి 2వ ర్యాంకుతో పాటు 34 మంది విద్యార్థులు వేర్వేరు ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. సీఎం ఫలితాల్లో సమానమైన మార్కులు వచ్చిన విద్యార్థులకు ఒకే ర్యాంకును, ఇద్దరు, ముగ్గురుకు ప్రకటిస్తారని పేర్కొన్నారు. సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో మొదటి 50 ర్యాంకుల్లో 83ను కైవసం చేసుకున్న ఏకైక విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ అని తెలిపారు.

ఏటీఎంలో చోరీ యత్నం విఫలం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఏటీఎంలో చోరీకి విఫల యత్నం జరిగింది. గ్రామంలోని మెయిన్‌రోడ్డులో ఇండీక్యాష్ ఏటీఎం కేంద్రం ఏడాది కిందట ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం వద్దకు వచ్చి గడ్డపార, ఇనుపరాడ్డు, సుత్తి, చువ్వలతో ఏటీఎం మెషీన్‌ను ధ్వంసం చేశారు. అయితే ఏటీఎం సేఫ్ లాకర్ తెరుచుకోకపోవటంతో చేసేది లేక వెనుదిరిగాడు. చోరీకి ఉపయోగించిన వస్తువులను అక్కడే వదిలేశాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో దుండగుడు తెచ్చిన వస్తువులను తిరిగి తీసుకెళ్తుండగా స్థానికులు ప్రశ్నించటంతో పరారయ్యాడు. బుధవారం తెల్లవారుజామున బొడ్డు రాయి సెంటర్‌లోని బెంగళూరు బేకరీలో జరిగిన చోరీ విషయం విదితమే. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించి విడిచిపెట్టారు. పోలీసులు విడిచిపెట్టిన దుండగుడే ఏటీఎంను పగలగొట్టాడని స్వయంగా చూసిన స్థానికులు చెబుతున్నారు. చోరీ యత్నం తెలుసుకున్న పోలీసులు ఏటీఎం కేంద్రాన్ని పరిశీలించారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

బాలికపై లైంగిక దాడి

బాలుడిపై పోక్సో కేసు నమోదు

పెదకాకాని: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై బాలుడు లైంగిక దాడి చేసిన సంఘటన వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు బలవంతంగా అత్యాచారం చేసినట్లు బాధిత బాలిక గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరి ఫిర్యాదు చేసింది. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం పెదకాకాని సీఐ కొమ్మనబోయిన వీరాస్వామి తెలిపారు.

వర్తక వ్యాపారానికి లైసెన్సు తప్పనిసరి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988 కింద ప్రతి ఒక్క దుకాణ, సంస్థ వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని గుంటూరు జోన్–3 జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, విజయవాడ కార్మిక కమిషనర్ ఆదేశాల మేరకు జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం వర్తక యాజమాన్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. సొంత వ్యాపార దుకాణాలు, సంస్థలు కూడా లైసెన్సు పొందాల్సి ఉంటుందన్నారు. లైసెన్సు నమోదు ప్రక్రియ ఈనెల 29 లోపు పొందాలన్నారు. ప్రతి వర్తక యాజమాన్య సంఘాల వారు ఈ విషయమై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దుకాణాలు, సంస్థల యజమానులు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో, మీసేవ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. 2024 ఫిబ్రవరి ముగుస్తున్నందున దుకాణ, సంస్థల యజమానులు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ పొందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర వివరాలకు కార్మిక శాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	535	73,158
నిఫ్టీ ▲	162	22,217

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,960	▲ 379
డోజోన్స్	38,878	▲ 265
ఎఫ్‌టీఎస్ఈ 100	7,684	▲ 22
డాక్స్	17,370	▲ 252
షాంఘై	2,988	▲ 37
నికాయ్	39,099	▲ 836

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	62,155 ▽ 103
బంగారం (99.5 స్వచ్ఛత)	61,906 ▽ 103
వెండి (కిలో)	70,396 ▽ 312

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.51	83.53
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.62	106.16
€	యూరో	ఒకటి	88.61	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.76	56.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.58	55.50
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.41	64.01
SAR	సౌదీ రియాల్	[illegible]	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.96	23.49
¥	చైనా యువాన్	[illegible]	10.42	12.49

మారుత్ డ్రోన్స్‌కు తొలి యుటిలిటీ పేటెంట్

డ్రోన్ల సాయంతో వరిసాగు

హైదరాబాద్: మారుత్ డ్రోన్స్ ప్రపంచంలోనే తొలి యుటిలిటీ పేటెంట్‌ను (మేథో సంపత్తి హక్కు) 20 ఏళ్ల కాలానికి సొంతం చేసుకుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ (పీజేటీఎస్ఏయూ) సహకారంతో మారుత్ డ్రోన్స్ అభివృద్ధి చేసిన డైరెక్ట్ సీడింగ్ డ్రోన్‌కు ఈ పేటెంట్ దక్కింది. క్షేత్రస్థాయిలో వరిసాగు కోసం డైరెక్ట్ సీడింగ్ డ్రోన్లను విస్తృతంగా వినియోగించే దిశగా పనిచేయనున్నట్టు సంస్థ ప్రకటించింది. 2030 నాటికి మిలియన్ హెక్టార్లలో విత్తు నాటాలన్న లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నట్లు మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ తెలిపారు.



మూడేళ్లలో రూ. 10 వేల కోట్ల ఆదాయం

డెకరేటివ్ పెయింట్స్ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్



న్యూఢిల్లీ: కొత్త వెంచర్ అయిన డెకరేటివ్ పెయింట్స్ వ్యాపార విభాగం నుంచి వచ్చే మూడేళ్లలో రూ. 10,000 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. అప్పటికల్లా లాభాల్లోకి మళ్లగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిర్లా ఓపస్ బ్రాండ్ కింద డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంతో పాటు మూడు పెయింట్ ప్లాంట్లను గురువారం ఆయన ప్రారంభించారు. పానిపట్ (హరియాణ), లూధియానా (పంజాబ్), చెయ్యార్ (తమిళనాడు)లో ఈ ప్లాంట్లు ఉన్నాయి. బిర్లా ఓపస్ పెయింట్లు మార్చి నుంచి పంజాబ్, హరియాణ, తమిళనాడులో లభ్యమవుతాయి. జూలై నుంచి 1 లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో ఇవి లభిస్తాయని బిర్లా చెప్పారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 6,000 పట్టణాలకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. గ్రూప్‌లో కీలకమైన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ గతేడాది డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంలోకి అడుగు పెడుతున్నట్లు ప్రకటించింది. 2025 నాటికి రూ. 10,000 కోట్లతో దేశీయంగా ఆరు తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే రూ. 5,000 కోట్లు వెచ్చించినట్లు బిర్లా ఓపస్ బిజినెస్ హెడ్ హిమాంశు కపానియా తాజాగా చెప్పారు. దేశీయంగా డెకరేటివ్ పెయింట్స్ మార్కెట్ దాదాపు రూ. 80,000 కోట్ల స్థాయిలో ఉంది. ఏషియన్ పెయింట్స్, బర్జర్ పెయింట్స్, నెరోలాక్, అక్జో నోవెల్ (డ్యూలక్స్) ఈ విభాగంలో దిగ్గజాలుగా ఉన్నాయి.

వొడా ఐడియా నిధుల బాట

- ఈ నెల 27న బోర్డు సమావేశం
- కంపెనీ బలిమికి కట్టుబాటు
- కుమార మంగళం బిర్లా వెల్లడి

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు ప్రతిపాదించింది. ఈ అంశంపై చర్చించేందుకు కంపెనీ బోర్డు ఈ నెల 27న సమావేశం కానున్నట్లు కంపెనీ పేర్కొంది. నిధుల సమీకరణకున్న అన్ని అవకాశాలను బోర్డు పరిశీలించనున్నట్లు తెలియజేసింది. రైట్స్, పబ్లిక్ ఆఫర్, ప్రిఫరెన్షియల్ కేటాయింపులు, క్విప్ తదితర మార్గాలతోపాటు.. ఒకేసారి లేదా దశలవారీగా నిధుల సమీకరణకు తెరతీసే అంశంపై నిర్ణయించనున్నట్లు వివరించింది. వెరసి ఈక్విటీ లేదా రుణ మార్గాలలో నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు బీఎస్ఈకి వొడాఫోన్ ఐడియా తాజాగా వెల్లడించింది.



విదేశీ ఇన్వెస్టర్లకు చోటు

నగదు సవాళ్లను ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా కంపెనీ బలిమికి కట్టుబడి ఉన్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమారమంగళం బిర్లా తాజాగా స్పష్టం చేశారు. బిర్లా గ్రూప్ డెకరేటివ్ పెయింట్ల బిజినెస్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వొడాఫోన్‌లో విదేశీ ఇన్వెస్టర్లకు చోటు కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అయితే బోర్డులో విదేశీ ఇన్వెస్టర్లు ఎప్పుడు ప్రవేశిస్తారన్న అంశంపై ఇప్పుడే చెప్పలేమన్నారు. ఇందుకు వ్యూహాత్మకంగా తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వొడాఫోన్ ఐడియాలో ఆదిత్య బిర్లా గ్రూప్ సహప్రమోటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో కంపెనీ రూ. 6,986 కోట్లకు నికర నష్టాన్ని తగ్గించుకుంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,990 కోట్ల నష్టం ప్రకటించింది. దాదాపు రూ. 756 కోట్ల అనూహ్య లాభాలు నష్టాలు తగ్గేందుకు సహకరించాయి. భారీ రుణ భారాన్ని మోస్తున్న వొడాఫోన్ ఐడియా మొబైల్ టెలికం రంగంలోని ప్రత్యర్థి సంస్థలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.

నిధుల సమీకరణ వార్తలతో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో 6.3 శాతం జంప్‌చేసి రూ. 16.30 వద్ద ముగిసింది.

-542 నుంచి +535

కనిష్టాల నుంచి మార్కెట్ ర్యాలీ



- నాలుగో రోజు నిఫ్టీ సరికొత్త రికార్డు
- ట్రేడింగ్‌లో భారీ ఒడిదుడుకులు

ముంబై: మిడ్‌సెషన్ నుంచి ఆటో, ఐటీ, టెక్నాలజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు గురువారం కనిష్ట స్థాయిల నుంచి బౌన్స్ బ్యాక్ అయ్యాయి. యూరో జోన్ తయారీ, సేవా రంగ పీఎంఐ డేటా అంచనాలకు మించి నమోదవడంతో పాటు అమెరికా టెక్ కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడం దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ర్యాలీకి తోడ్పాటు అందించాయి. ఉదయం స్తబ్దుగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 542 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 535 పాయింట్ల లాభంతో 73,158 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 1176 పాయింట్ల రేంజ్‌లో 72,081 వద్ద కనిష్టాన్ని, 73,256 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 180 పాయింట్ల నష్టం తేరుకొని 162 పాయింట్లు బలపడి 22,217 వద్ద స్థిరపడింది. ఒక దశలో 197 పాయింట్లు పెరిగి వరుసగా నాలుగోరోజూ 22,252 వద్ద జీవితకాల గరిష్టాన్ని లిఖించింది. ఈ సూచీకి ముగింపు(22,217)కూడా కొత్త రికార్డు కావడం విశేషం. ఆటో, ఐటీతో పాటు క్యాపిటల్ గూడ్స్, పారిశ్రామిక, విద్యుత్ రంగాల షేర్లు రాణించాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.92%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,410 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,824 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియాలో ఇండోనేసియా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% వరకు ర్యాలీ చేశాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ ఎక్స్ఛేంజీలు 1.50% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు 2% లాభాల్లో ట్రేడవుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) సీజన్‌లో చెరకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.25 మేర పెంచుతున్నట్లు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవడంతో చక్కెర ధరలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో రానా షుగర్స్, మవాన షుగర్స్, శ్రీ రేణుక షుగర్స్, దాల్మియా షుగర్స్, భరత్ షుగర్ అండ్ ఇండస్ట్రీస్, ఈఐడీ ప్యారీ షుగర్స్ షేర్లు 3% – 1% చొప్పున నష్టపోయాయి.

డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.85 వద్ద స్థిరపడింది.

కొత్త చందాదారుల ఆకర్షణలో జియో టాప్

డిసెంబర్‌లో 40 లక్షల కస్టమర్లు • ఎయిర్‌టెల్‌లోకి 18.5 లక్షలు • 119 కోట్లకు టెలికం చందాదారులు



న్యూఢిల్లీ: కొత్త కస్టమర్లను ఆకర్షించడంలో మరోసారి రిలయన్స్ జియో ముందుంది. 2023 డిసెంబర్ నెలకు గాను 39.94 లక్షల మొబైల్ చందాదారులను జియో సొంతం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్ కిందకు కొత్తగా 18.5 లక్షల మంది కస్టమర్లు వచ్చి చేరారు. అదే సమయంలో ఎప్పటి మాదిరే వొడాఫోన్ ఐడియా మరో 13.68 లక్షల కస్టమర్లను డిసెంబర్‌లో కోల్పోయింది. ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ 1.5 లక్షల కస్టమర్లు, ఎంటీఎన్ఎల్ 4,420 మంది కస్టమర్ల చొప్పున నష్టపోయాయి. మొత్తం టెలికం చందాదారులు 2023 నవంబర్ నాటికి 1,185.73 మిలియన్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 1,190.33 మిలియన్లకు (119 కోట్లకు) చేరారు. నెలవారీగా ఇది 0.39 శాతం వృద్ధికి సమానం. బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు సైతం 90.4 కోట్లకు పెరిగారు. వైర్‌లైన్ టెలిఫోన్ చందాదారుల సంఖ్య నవంబర్ చివరికి 3.15 కోట్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 3.18 కోట్లకు పెరిగింది. వైర్‌లైన్ విభాగంలో జియో 2.46 లక్షల కొత్త కస్టమర్లను సాధించింది. ఎయిర్‌టెల్ 82,317 మంది, వొడాఫోన్ ఐడియా 9,656, క్వాండ్రంట్ 6,926 కస్టమర్ల చొప్పున సొంతం చేసుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ 34,250 మంది, టాటా టెలిసర్వీసెస్ 22,628 మంది చొప్పున కస్టమర్లను కోల్పోయాయి.

సి.ఎం.ఆర్. ప్రచారకర్తగా మృణాల్ ఠాకూర్

హైదరాబాద్: ప్రముఖ వస్త్ర స్వర్ణాభరణాల సంస్థ సి.ఎం.ఆర్.షాపింగ్ మాల్ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి మృణాల్ ఠాకూర్ నియమితులయ్యారు. తెలుగువారి ప్రతి వేడుకలో భాగమైన సి.ఎం.ఆర్.కు ప్రచారకర్తగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని మృణాల్ ఠాకూర్ ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుభ కార్యాలకు ప్రత్యేక పట్టువస్త్రాలు, యువత మెచ్చే సరికొత్త ఫ్యాషన్స్, అద్భుతమైన డిజైన్లతో కిడ్స్ వేర్ కలెక్షన్స్ ఇక్కడ లభిస్తాయన్నారు. ''మృణాల్ ఠాకూర్ మా సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉంది. ప్రపంచ స్థాయి ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త కలెక్షన్స్ మా వద్ద లభిస్తాయి'' అని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ తెలిపారు



అశోక్ లేలాండ్ @ 30 లక్షలు



చెన్నై: హిందూజా గ్రూప్ కంపెనీ, వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఉత్తరాఖండ్‌లోని పంత్‌నగర్ వద్ద ఉన్న కంపెనీ ప్లాంటు మొత్తం 30 లక్షల యూనిట్లను తయారు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అత్యంత విశ్వసనీయ ఉత్పత్తులను తయారు చేయడంలో, అగ్రశ్రేణి కస్టమర్ సేవలను అందించడంలో సుస్థిర ఖ్యాతికి ఈ మైలురాయి నిదర్శనం అని అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేణు అగర్వాల్ గురువారం తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
22-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	534–00
వరంగల్	536–00
రిటైల్ ధర	5.95

సాక్షి స్పోర్ట్స్



ఐపీఎల్ నుంచి షమీ అవుట్

భారత పేస్ బౌలర్ షమీ ఎడమ కాలి మడమ గాయం కారణంగా ఐపీఎల్–2024 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. గత నెలలో లండన్‌లో ఈ గాయానికి చికిత్స తీసుకునే క్రమంలో మడమకు అతను ప్రత్యేక ఇంజక్షన్‌లు తీసుకున్నాడు. అయితే అవి ప్రభావం చూపించకపోవడంతో శస్త్ర చికిత్స చేయించుకోవడం తప్పనిసరిగా మారింది. త్వరలోనే అతను మళ్లీ లండన్‌కు వెళతాడు. వన్డే వరల్డ్ కప్‌లో 24 వికెట్లతో భారత్‌ను ఫైనల్ చేర్చడంలో కీలక పాత్ర పోషించిన షమీ ఆ తర్వాత మరే మ్యాచ్‌లోనూ బరిలోకి దిగలేదు.

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్

రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఎలైట్ డివిజన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం మొదలుకానున్నాయి. ఇండోర్‌లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర జట్టు... ముంబైలో బరోడాతో ముంబై జట్టు... నాగ్‌పూర్‌లో కర్ణాటకతో విదర్భ... కోయంబత్తూరులో తమిళనాడుతో డిఫెండింగ్ చాంపియన్ సౌరాష్ట్ర తలపడనున్నాయి.

చెన్నై X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్ మొదటి పోరు

- తొలి దశ షెడ్యూల్ విడుదల
- వైజాగ్‌లో రెండు ఢిల్లీ జట్టు మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2024కు అధికారికంగా నగారా మోగింది. మార్చి 22న జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తమ సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడుతుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ రెండు దశల్లో ఐపీఎల్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. అందుకే తొలి దశలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 మధ్య జరిగే 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసింది. లీగ్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మిగిలిన 53 మ్యాచ్‌ల తేదీలు, వేదికలను బోర్డు ప్రకటిస్తుంది. గత రెండు సీజన్ల తరహాలోనే 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్ లీగ్ దశలో 14 మ్యాచ్‌లు ఆడుతుంది. టోర్నీ ఫైనల్ మే 26న జరిగే అవకాశం ఉంది. తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో నాలుగు తేదీల్లో ఒకేరోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ 17 రోజుల్లో ఢిల్లీ, గుజరాత్, బెంగళూరు గరిష్టంగా ఐదేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి.

అందుకే విశాఖలో...

ఆంధ్ర క్రికెట్ అభిమానులకు ఐదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు చూసే అవకాశం దక్కుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తమ రెండు 'హోమ్' మ్యాచ్‌లను వైజాగ్‌లో ఆడాలని నిర్ణయించుకుంది. క్యాపిటల్స్ సొంత వేదిక ఫిరోజ్‌షా కోట్లా మైదానం మార్చి 17న జరిగే డబ్ల్యూపీఎల్ ఫైనల్ సహా మొత్తం 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. దాంతో ఐపీఎల్‌కు ముందు గ్రౌండ్ సన్నద్ధతకు తగినంత సమయం లభించడం లేదు. ఈ కారణంగా క్యాపిటల్స్ తమ వేదికను వైజాగ్‌కు మార్చింది. విశాఖలో వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఇప్పటి వరకు 13 ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. ఆఖరి సారిగా 2019 లీగ్‌లో ఎలిమినేటర్, క్వాలిఫయింగ్–2 మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా తమ హోమ్ వేదికను మార్చింది. ఇప్పటి వరకు మొహాలి ఈ టీమ్ సొంత గ్రౌండ్‌గా ఉండగా... చండీగఢ్ శివార్లలో ముల్లన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన స్టేడియంలో ఇకపై తమ హోమ్ మ్యాచ్‌లు ఆడుతుంది.



బెంగళూరు కెప్టెన్ డు ప్లెసిస్, చెన్నై కెప్టెన్ ధోని (ఫైల్)

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	చండీగఢ్
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్ X లక్నో	జైపూర్
మార్చి 24	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్
మార్చి 25	బెంగళూరు X పంజాబ్	బెంగళూరు
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్
మార్చి 28	రాజస్తాన్ X ఢిల్లీ	జైపూర్
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో X పంజాబ్	లక్నో
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	వైజాగ్
ఏప్రిల్ 1	ముంబై X రాజస్తాన్	ముంబై
ఏప్రిల్ 2	బెంగళూరు X లక్నో	బెంగళూరు
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	వైజాగ్
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్
ఏప్రిల్ 6	రాజస్తాన్ X బెంగళూరు	జైపూర్
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై
ఏప్రిల్ 7	లక్నో X గుజరాత్	లక్నో

నోట్: తొలి మ్యాచ్ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి... మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

సిరీస్ లక్ష్యంగా...

ఐదుటెస్టుల సిరీస్‌లో భారత్ మూడో టెస్టుతో పైచేయి సాధించింది. ఇప్పుడు రాంచీలో సిరీస్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్ శర్మ బృందానికి ఇప్పుడు యువ ఆటగాళ్లే బలంగా మారారు. యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ అవకాశాల్ని బాగా అందిపుచ్చుకున్నారు. ఇపుడు ఇదే బలగంతో ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఇక్కడే ముగించాలని టీమిండియా ఆశిస్తోంది.

- సమరోత్సాహంతో టీమిండియా
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు
- ఒత్తిడిలో స్టోక్స్ బృందం
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


స్టోక్స్

రాంచీ: తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్ ఆ తర్వాత వరుసగా రెండు, మూడు టెస్టుల్లో గెలిచింది. రెండో టెస్టులో బుమ్రా పేస్, మూడో టెస్టులో జడేజా స్పిన్ కీలక భూమిక పోషిస్తే... ఈ రెండు టెస్టుల్లోనూ యువ సంచలనం యశస్వి డబుల్ సెంచరీలు కామన్‌గా కలిసొచ్చాయి. రోహిత్, గిల్‌లతో టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డరే అనుభవలేమితో ఉంది. రజత్ పటిదార్‌కు రెండు మ్యాచ్‌ల్లోనూ అవకాశమిచ్చినా ఏమాత్రం మెప్పించలేకపోయాడు. గత మ్యాచ్ ఆడిన సర్ఫరాజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిరూపించుకున్నాడు. జడేజా శతకం మిడిలార్డర్‌ను నిలబెట్టింది. బుమ్రా లేని పేస్ బౌలింగ్‌కు తొలిసారిగా సిరాజ్ పెద్దదిక్కయ్యాడు. ఇన్నాళ్లు షమీ, బుమ్రాలతో బంతిని పంచుకునే అతను రాంచీలో ప్రధాన పేసర్‌గా బరిలోకి దిగబోతున్నాడు. స్పిన్ వికెట్ కాబట్టి ముగ్గురు రెగ్యులర్ స్పిన్నర్లు బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గురువారం నెట్స్‌లో ఆకాశ్‌దీప్ గంటల తరబడి శ్రమించాడు. ఒకవేళ సిరాజ్‌కు జోడీగా అతన్ని పరిశీలించవచ్చు.


రోహిత్

సమం కోసం ఇంగ్లండ్ సమరం

ప్రస్తుత భారత్‌తో పోలిస్తే స్టోక్స్, రూట్, డకెట్, క్రాలీ, పోప్, అండర్సన్‌లతో కూడిన ఇంగ్లండే అనుభవజ్ఞులతో మేటిగా ఉంది. అయినాసరే సిరీస్‌లో భారత కుర్రాళ్ల జోరుకు కళ్లెం వేయలేక డీలా పడుతోంది. రాజ్‌కోట్‌లో అయితే మొదటి ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన స్టోక్స్ సేన రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి చేతులెత్తేసింది. రూట్, ఒలీ పోప్, బెయిర్‌స్టోల వైఫల్యం జట్టుకు ప్రతికూలంగా మారింది. చాన్నాళ్ల తర్వాత కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్ వేసేందుకు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే మోకాలి గాయం వల్ల స్టోక్స్ పూర్తిగా బ్యాటింగ్‌కే పరిమితమయ్యాడు. గత జూన్ నుంచి బౌలింగ్‌కే దిగలేదు. ఇప్పుడు మాత్రం బంతిపట్టే యోచనలో పడ్డాడు. వరుస మ్యాచ్‌ల ఓటమిలతో ఇంగ్లండ్ తుది జట్టులో మార్పులు చేసింది. లెగ్ స్పిన్నర్ రేహన్ అహ్మద్ స్థానంలో ఆఫ్‌స్పిన్నర్ షోయబ్ బషీర్‌ను హార్ట్‌లీకి జోడీగా బరిలోకి దించుతోంది. మార్క్ వుడ్‌ను తప్పించి రాబిన్సన్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, శుబ్‌మన్ గిల్, పటిదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, సిరాజ్, కుల్దీప్, ముకేశ్/ఆకాశ్‌దీప్.

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, ఒలీ పోప్, జో రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, బషీర్, రాబిన్సన్, అండర్సన్.

మహిళల లీగ్‌కు వేళాయె...



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో కెప్టెన్లు స్మృతి, బెత్ మూనీ, అలీసా హీలీ, మెగ్ లానింగ్, హర్మన్‌ప్రీత్

నేటి నుంచి డబ్ల్యూపీఎల్	బరిలో 5 జట్లు, 22 మ్యాచ్‌లు	తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ 'ఢీ'	మార్చి 17న ఫైనల్ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గత ఏడాది తొలి సీజన్‌లో అభిమానులను ఆకట్టుకొని పలువురు యువ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చిన ఈ లీగ్ మరోసారి అదే స్థాయిలో ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. నేడు చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో గత సీజన్ విజేత ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. మిగతా మూడు జట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గత ఏడాదిలాగే ఈసారి కూడా టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 17న ఢిల్లీ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

తాజా సీజన్ విశేషాలు....

- గత సీజన్‌లో ఒక్క ముంబైలోనే అన్ని మ్యాచ్‌లు జరిగాయి. ఈసారి బెంగళూరు, ఢిల్లీలను వేదికలుగా ఎంపిక చేశారు.
- తొలి సీజన్‌లాగే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో తలపడతాయి.
- గత ఏడాది ఐదు టీమ్‌లకు కెప్టెన్లుగా వ్యవహరించిన వారే ఈసారి సారథులుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన మెగ్ లానింగ్ (ఢిల్లీ), అలీసా హీలీ (యూపీ), బెత్ మూనీ (గుజరాత్) ఆస్ట్రేలియన్లే కాగా...హర్మన్‌ప్రీత్ (ముంబై), స్మృతి మంధాన (బెంగళూరు) భారత స్టార్లు. భారత్ మినహా ఆసీస్ నుంచే గరిష్టంగా 13 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు.
- 2023 సీజన్‌లో సత్తా చాటిన సైకా ఇషాక్, శ్రేయాంక పాటిల్ ఆ తర్వాత భారత జట్టుకు ఎంపికయ్యారు. గత ఏడాది వీరిని కనీస ధర రూ.10 లక్షలకు తీసుకోగా... రెండు సీజన్ల మధ్య భారత జట్టుకు ఆడటంతో బీసీసీఐ నిబంధనల ప్రకారం వీరిద్దరికి రూ. 30 లక్షల చొప్పున లభిస్తాయి.
- ఈ సీజన్ వేలంలో కాశ్వీ గౌతమ్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకుంది. అయితే గాయం కారణంగా ఆమె ఈ సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకోవడం గమనార్హం.
- హైదరాబాద్, ఆంధ్ర జట్ల నుంచి 8 మంది ఈసారి డబ్ల్యూపీఎల్‌లో బరిలోకి దిగనున్నారు. హైదరాబాద్ ప్లేయర్లు అరుంధతి రెడ్డి (ఢిల్లీ), త్రిష పూజిత (గుజరాత్), యషశ్రీ, గౌహర్ సుల్తానా (యూపీ) జట్లకు... ఆంధ్ర క్రికెటర్లు స్నేహ దీప్తి (ఢిల్లీ), సబ్బినేని మేఘన (బెంగళూరు), షబ్నమ్ (గుజరాత్), అంజలి శర్వాణి (యూపీ) టీమ్‌ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.